ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ డ్యాగురే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

నాగోలు: నాగోలు ఫొటో–వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళ వారం ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ డ్యాగురే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు సహదేవ్ మాట్లాడుతూ.. ఫొటోలు జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, కిషన్, సురేష్, ఉస్మాన్, ప్రశాంత్, రమేష్, భాను, నర్సింహ, సుభాష్, శ్రీశైలం, మహేందర్ పాల్గొన్నారు.

మంత్రికి వినతి



మంత్రి లక్ష్మణ్‌కు వినతిపత్రం ఇస్తున్న కుమారన్న

దిల్‌సుఖ్‌నగర్: ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు పోటీ పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చొరవ తీసుకోవాలని ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్, రాష్ట్ర అధ్యక్షులు ఎం.కుమారన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ నుంచి పీజీ వరకు దాదాపు 7 సంవత్సరాలు విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటారని, కళాశాల చదువుతో పాటు అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు, సివిల్స్, గ్రూప్స్ సెంట్రల్‌కు సంబంధించిన పోటీ పరీక్షలకు సంబంధించి ప్రత్యే శిక్షణ ఇప్పిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

కార్పొరేటర్‌కు సత్కారం



వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాసపురం కాలనీలో డే కేర్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేసిన కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డిని మంగళవారం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ సిటిజన్స్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పి.గోపాల్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగం కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.శ్రీరాములు నేత, అంజిరెడ్డి, టి.శంకర్‌రెడ్డి, జి.మురళీధర్, ఎం.గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, రమేష్ యాదవ్, నాసర్‌రెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం



ఓపెన్‌జిమ్ స్థలాన్ని పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: వ్యాయామంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధి ఎస్కేడీనగర్‌కాలనీలోని పార్కులో ప్రారంభం కానున్న ఓపెన్‌జిమ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాలనీలో నెల కొన్న సమస్యలను పరిష్కరించానని, మిగిలిపోయిన పనులను త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. సుబ్బారావు, సింహాచలం, జానకీ రామారావు, ఎస్వీ కృష్ణారావు, శ్రీధర్‌రావు, వెంకట్‌రెడ్డి, సుబాష్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, శంకర్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ అటెండెన్స్ వద్దు

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలోని ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఏబీఏఎస్ బయోమెట్రిక్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లు డా.నాగేందర్, డా.కృష్ణకు వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వచ్చే జీతం తక్కువని, అది కూడా 3, 4 నెలలకు ఓ సారి వస్తుందన్నారు. ఏబీఏఎస్ అటెండెన్స్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందరివద్ద ఆండ్రాయిడ్ ఫోన్లు లేవని బయోమెట్రిక్ అటెండెన్స్ నుంచి వీరికి మినహాయింపు ఇవ్వాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో శ్రీనివాస్, శాంతికుమార్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులా..

అవెక్కడ?



సుబ్రహ్మణ్యనగర్‌లో బాక్స్ డ్రెయిన్ నిర్మించామని చెబుతున్న ప్రాంతం

పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు బిల్లులు

ఆర్టీఐతో వెలుగులోకి

కమిషనర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు

> ఐఎస్‌సదన్ డివిజన్‌లో అభివృద్ధి పనుల కాంట్రాక్ట్ దక్కితే చాలు.. అందుకు సంబంధించిన నిధులు అమాంతంగా ఆ కాంట్రాక్టర్ల జేబులోకి వెళ్తాయి. రహదారి నిర్మాణం, డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఇలా ఎలాంటి పనికి సంబంధించిన సరే అధికారులను ప్రసన్నం చేసుకొని వాటిని నామినేటెడ్ పద్ధతిలో దక్కించుకుంటే అక్కడ ఎలాంటి పని చేయకుండానే ఆ పనికి మంజూరైన నిధులను సదరు కాంట్రాక్టర్ అధికారులతో కలిసి పంచుకోవచ్చు. అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నా ఉన్నతాధికారుల్లో చలనం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
> – సైదాబాద్

వరసగా వెలుగులోకి..

గత మే నెలలో సింగరేణి కాలనీలో సీసీ రహదారి వేయకుండానే రూ. 10 లక్షల బిల్లులు కాంట్రాక్టర్, అధికారులు పంచుకున్నారని కార్పొరేటర్ చేసిన ఫిర్యాదుతో కమిషనర్ విచారణ చేసి నిజమని తేల్చి అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఆ తర్వాత కూడా డీఎస్‌నగర్‌లో నాలా నిర్మించకుండానే రూ. 53 లక్షల బిల్లులు చేజిక్కించుకున్నారని కార్పొరేటర్ ఫిర్యాదు చేసారు. ఇప్పుడు డివిజన్ కార్పొరేటర్ ఐఎస్‌సదన్ డివిజన్‌లో పూర్తయినట్లు అధికారులు ఆర్టీఐ ద్వారా ఇచ్చిన మూడు అభివృద్ధి పనుల విషయమై కార్పొరేటర్ సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అక్కడ ఎలాంటి పనులు చేపట్టకుండానే అధికారులు రూ. లక్షలు తమ జేబుల్లో వేసుకున్నారని ఆరోపిస్తున్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తయినట్లు అధికారులు చెబుతున్న ప్రాంతం ఇదే..

కమ్యూనిటీ హాల్ పేరుతో..

డీఎస్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పక్కన అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేసామని అధికారులు చెబుతూ రూ. 10.50 లక్షల బిల్లును కాంట్రాక్టర్‌కు చెల్లించారు. ప్రస్తుతం ఆ పని స్టేటస్‌ను అధికారులు కంప్లీటెడ్ అని ఆర్టీఐ సమాధానం ద్వారా తెలిపారు. కానీ ఇప్పటికీ అక్కడ అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణమే దర్శనమిస్తుంది. అదే కాలనీలో అక్కడ ఉన్న టాయిలెట్లను కూల్చి అక్కడ కమ్యూనిటీహాల్ నిర్మించినందుకు అధికారులు కాంట్రాక్టర్‌కు రూ. 18.60 లక్షలు చెల్లించారు. కానీ అక్కడ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు.

బాక్స్ డ్రెయిన్ పేరుతో రూ. 22 లక్షలు

డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ నగర్ కాలనీ నుంచి సుబ్రహ్మణ్యనగర్ జీహెచ్ఎంసీ మోడల్ మార్కెట్ వరకు 2021–2022లో బాక్స్ డ్రెయిన్ నిర్మాంచామని అధికారులు చెబుతున్నారు. అందుకు రూ. 22 లక్షల బిల్లులు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. కానీ అక్కడ బాక్స్ డ్రెయిన కాదు కదా చిన్న గుంత తీసిన ఆనవాలు కూడా లేవు.



కమిషనర్ కర్ణన్‌కు ఫిర్యాదు చేస్తున్న ఐఎస్‌సదన్ కార్పొరేటర్

కమిషనర్‌కు ఫిర్యాదు

ఐఎస్‌సదన్ డివిజన్‌లో తప్పిన కొద్ది అధికారులు, కాంట్రాక్టర్లు చేసిన అవినీతి అక్రమాలు బయటకు వస్తున్నాయని కార్పొరేటర్ ఆరోపిస్తున్నారు. ఈ విషయాలపై మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేసారు. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకే తాము విషయాలను శోధించి నిజాలు వెలికి తీసామని తెలిపారు. తన ఫిర్యాదుపై విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కమిషనర్‌ను కోరారు.

స్వతంత్ర కమిటీతో విచారించాలి

ఆర్టీఐ ద్వారా సేకరించిన సమాచారంతో తాను చేస్తున్న ఫిర్యాదులపై ఉన్నతాధికారులు స్వతంత్ర కమిటీతో విచారణ జరిపిస్తే నిజానిజాలు బయటకు వస్తాయి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కాంట్రాక్టర్లు వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి. వారి నుంచి నిధులు వసూలు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

– జంగం శ్వేతమధుకర్‌రెడ్డి–ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్

అక్రమ వ్యాపారం చేస్తున్న మార్వాడీలు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ

మన్సూరాబాద్: మార్వాడీలు అక్రమ వ్యాపారం చేస్తూ... తెలంగాణలో దశాబ్దాల కాలంగా వ్యాపారాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వైశ్యుల వ్యాపారాలను దెబ్బతీస్తున్నారని వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా అన్నారు. మార్వాడీ వ్యాపారి హఠావో.. తెలంగాణ వ్యాపారీ బచావో కార్యక్రమం పేరుతో ఎల్‌బీనగర్‌లో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వైశ్యులు మార్వాడీలకు వ్యతిరేకం కాదని, వారు చేస్తున్న దొంగ వ్యాపారాలకు మాత్రమే వ్యతిరేఖమన్నారు. మార్వాడీలు నెలకొల్పిన సంస్థల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వటం లేదని, తమ ప్రాంతం నుంచి తెచ్చుకున్న తమవారికి మాత్రమే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని మండిపడ్డారు. మార్వాడీలు చేస్తున్న అక్రమ వ్యాపారంపై వైశ్య సంఘాలు ప్రశ్నిస్తుంటే, కేంద్రమంత్రి బండి సంజయ్ మతం రంగు రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్వాడీలు మాత్రమే హిందువులు అన్నట్లు కేంద్రమంత్రి మాట్లాడుతున్నారని, తెలంగాణలో ఉన్న వైశ్యులు కూడా హిందువులేనని, అత్యధికశాతం వైశ్యులు బీజేపీకే మద్దతు పలుకుతున్నారనే విషయం మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఎంఐఎం, కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల ప్రోద్బలంతో మార్వాడీలపై వ్యతరేఖ ఉద్యమం చేస్తున్నారని పేర్కొనడం సిగ్గుచేటన్నారు. మార్వాడీల అక్రమ వ్యాపారం తగ్గే వరకు ఉద్యమం సాగుతుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పాండు రంగాచారి, సల్వాచారి, రామాచారి, శ్యాంసుందర్‌గౌడ్, ఉపేంద్రయాదవ్, ఉప్పల శ్రవన్, నంగునూరి రమేష్, కొత్త రవి పాల్గొన్నారు.

మార్వాడీలపై కుట్రలు పన్నుతున్నారు



మాట్లాడుతున్న సహదేవ్‌యాదవ్

చంచల్‌గూడ: కొందరు కమ్యూనిస్టులు, కుహాన మేధావులు మార్వాడీలపై కుట్రలు పన్నుతున్నారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన కుర్మగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్వాడీ గోబ్యాక్ అని విద్వేషాలు సృష్టిస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. మార్వాడీ గోబ్యాక్ అని కుట్రలు లేపిన వారికి దేశంలో చొరబడిన బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు కనపబడటం లేదా అని ప్రశ్నించారు. వ్యాపారాలు చేసుకుంటున్న మార్వాడీలను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దోచుకునేందుకు కొందరు కొత్త నినాదంతో వస్తున్నారన్నారు. మార్వాడీలు కూడా హిందూ మతంలో భాగమని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో తంగెళ్ల సుధీర్, ఉగాది మహేష్, బండ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలంటూ నిరసన



వరదలో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి ఎఫ్‌సీఐ కాలనీలోని 50 ఫీట్ల ప్రధాన రోడ్డులో చిన్నపాటి వర్షానికే వరద రోడ్డుపైకి చేరి కుంటను తలపిస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులతో మొర పెట్టుకున్నా స్పందించడం లేదని దీంతో మంగళవారం వరదనీటిలో నిలబడి నిరసన తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. నిరసనలో శ్రీనివాస్ రావు, నరసింహారావు, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు యాదవ్, సత్యనారాయణ, మాలాద్రి, మధుకర్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్ల మూతలు తీయొద్దు



వరద నీటిని పరిశీలిస్తున్న డీజీఎం హష్మత్‌అలీ

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ లోతట్టు ప్రాంతాల్లోని మ్యాన్‌హోళ్ల మూతలు తీయరాదని మలక్‌పేట జలమండలి డీజీఎం హష్మత్‌అలీ సూచించారు. మంగళవారం ఆయన ఎంఐఎం పార్టీ నాయకుడు షఫిఉద్దీన్, అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. అనుమతి లోతైన మ్యాన్ హోళ్లను తెరవరాదన్నారు. కాలనీలలో ఎక్కడైనా నీరు నిలిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద ఎమ్మెల్సీ నిధులతో చేపట్టిన బోర్‌వెల్ పనులను మంగళవారం ఎమ్మెల్సీ బొగ్గారపు దయానందగుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి తన వంతు సహకాం అందిస్తానన్నారు. అడిగిన వెంటనే బోర్ వేయించేందుకు నిధులు మంజూరు చేసినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొగ్గారపు శరత్‌చంద్ర, శశిధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవి కేశవ్ నాయుడు, తురుమలరెడ్డి పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి



మినీట్యాంక్ బండ్‌ను సందర్శించిన డీసీపీ ప్రవీణ్‌కుమార్

చైతన్యపురి: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జన కార్యక్రమం జరిగే సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను అన్ని శాఖల సమన్వయంతో చేపట్టాలని సూచించారు. బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని నిరంతర పర్యవేక్షించేందుకు అవసరమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. డీసీపీ వెంట అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

హయత్‌నగర్: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన నిమ్మ సుమన్‌రెడ్డి(30), తల్లితో కలిసి ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం తల్లి బయటకు వెళ్లడంతో ఇంటి వద్దనే ఉన్న సుమన్‌రెడ్డి రాత్రి 8 గంటల సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

క్రెడిట్ కార్డు లిమిట్ పేరుతో రూ.1.30 లక్షలు స్వాహా

నాగోలు: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతానని అకౌంట్‌లోని డబ్బులు కాజేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీ చెందిన సోలమన్ రాజుకు ఓ వ్యక్తి ఫోన్‌చేసి ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు మొత్తాన్ని రూ. 4 లక్షల వరకు పెంచుతామని నమ్మబలికాడు. ఆ తర్వాత ఖాతా వివరాలు, ఓటీపీలు తెలుసుకుని సోలమన్ రాజు క్రెడిట్ కార్డులో ఉన్న రూ. 1.30 లక్షలు డ్రా చేసుకున్నాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం స్కేటింగ్ రింగ్‌ను ఇండోర్ రింగ్‌గా మార్చడానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం స్కేటింగ్ రింగ్‌లో నిర్వహించిన తెలంగాణ రోలర్ స్కేటింగ్ అండ్ ఇన్‌లైన్ హాకీ ఇండిపెండెన్స్ కప్ ముగింపు వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, మల్లారెడ్డి, రామకృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఎల్‌బీనగర్: డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీకి జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్‌ను కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..కాలనీలో రోడ్లు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ వంటి సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారిస్తానని కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో అధ్యక్షుడిగా ఎన్నికైన సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు జలందర్‌రెడి భూపాల్‌రెడ్డి పోచమ్మ ఆలయ చైర్మన్ శివకుమార్,యాదయ్య,శివయాదవ్,సత్యం రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

కష్టపడితే విజయం ఖాయం



రామచంద్రరావును సన్మానిస్తున్న సభ్యులు

నాగోలు: కష్టపడితే ప్రతి రంగంలో విజయం సాధించవచ్చని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ సమాజం, సంఘాలను ఏకం చేయడంలో(బ్రాహ్మిన్స్ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్) బాస్ కృషి అభినందనీయమన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడలోని వసంత్ విహార్‌లో బాస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రామచంద్రరావుకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందరావు మాట్లాడుతూ..20 ఏళ్ల క్రితం ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో విశిష్ట అధికారులుగా బ్రాహ్మణులే ఉన్నారని గుర్తుచేశారు. బ్రాహ్మణులు ప్రభుత్వ రంగాల ఉద్యోగాలను ఎంచుకోవాలని పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, ఉమ్మడి ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఘనుల శాఖ మాజీ డైరెక్టర్ సుశీల్ కుమార్ బసవరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి



డీసీ అలీని సన్మానిస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: డివిజన్‌లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు సహకరించాలని మలక్‌పేట సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ ఎంకె అలీని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆమె ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సైదాబాద్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతులు కల్పించడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలన్నారు.

రామ్ నరసింహగౌడ్‌కు డాక్టరేట్

దిల్‌సుఖ్‌నగర్: ఉస్మానియా విశ్వవిద్యాలయం 84వ స్నాతకోత్సవం సందర్భంగా ఆర్‌కేపురంకు చెందిన వీరమళ్ల రామ్ నరసింహగౌడ్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణ్, వీసీ కుమార్ మొగుళం చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నాడు. ఈ సందర్భంగా రామ్ నరసింహగౌడ్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయం ఉస్మానియా యునివర్సిటీ అని ఇక్కడ నుంచి న్యాయ విభాగంలో పట్టా అందుకోసం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు.



డాక్టరేట్ అందుకున్న రామ్ నరసింహగౌడ్

భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం



బీమా బాండ్లను అందజేస్తున్న సాహెర్

హస్తినాపురం: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతీ సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్ అన్నారు. హస్తినాపురంలోని టీకేఆర్ కళాశాల పక్కన ఉన్న శ్రీలక్ష్మీ స్టీల్ ట్రేడర్ డీలర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాపీమేస్త్రీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌లతో భారతీ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు పిల్లర్లు, బ్రిడ్జిల, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపికని అన్నారు. అల్ట్రాఫాస్ట్ సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. డీలర్ కె. చంద్రశేఖరెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాదబీమా బాండ్లను అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతో డెంగీకి చెక్

సాక్షితో వైద్యాధికారిణి తరుణి



చాదర్‌ఘాట్: తరచూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంటుందని మూసీ పరీవాహక ప్రాంతాల వాసులు అప్రమత్తంగా ఉండాలని ఓల్డ్‌మలక్‌పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు తరుణి సూచించారు. దోమలు కుట్టడంతో డెంగీ, మలేరియా, వివిధ వ్యాధులు సోకుతాయని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం ఆమె సాక్షితో వివరించారు.

ప్రశ్న: డెంగీ జ్వరం ఎప్పుడు వస్తుంది?

జవాబు: ఏ సమయంలోనైనా డెంగీ రావచ్చు. కానీ వర్షాకాలంలో (ఆగస్టు–అక్టోబర్) నెలలో అధికంగా కనిపిస్తుంది.

ప్రశ్న: ఈ వ్యాధి ఎలా వస్తుంది?

జవాబు: ఎయిడెస్ ఈజిప్టై అనే దోమకాటుతో ఒకరి నుంచి మరొకరికి డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ జాతి దోమ మీద ఉండే నలుపు, తెలుపు చారలు ఉండటంతో దీనిని టైగర్ దోమ అని కూడా పిలుస్తారు.

ప్రశ్న: ఎయిడెస్ దోమ ఎక్కడ నివాసం ఏర్పర్చుకుంటుంది?

జవాబు: ఈ జాతి దోమ ఇళ్ల పరిసరాలలోనే ఉంటుంది. పూల కుండీలు, ఎయిర్ కూలర్స్, పాత టైర్స్, పాత ఖాళీ డబ్బాల వంటి వాటిలో నివాసం ఏర్పర్చుకుంటుంది.

ప్రశ్న: ఈ జాతి దోమ ఏ సమయంలో తిరుగుతుంది?

జవాబు: ఈ జాతి దోమ సూర్యోదయం, సూర్యాస్తమయం సమయాల్లో ఎక్కువగా తిరుగుతుంది. ఇది రాత్రి పూట సంచరించదు.

ప్రశ్న: డెంగీ లక్షణాలు ఏంటి?

జవాబు: హఠాత్తుగా జ్వరం వస్తుంది. తీవ్ర తల నొప్పి, కళ్ల మండటం వంటి లక్షణాలు ఉంటాయి.

ప్రశ్న: డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల ఏవి?

జవాబు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగీ వస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలి. డెంగీ బాధితులు పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగాలి. పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. కంటికి సరిపడే నిద్రపోవాలి.

ప్రశ్న: డెంగీపై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు ?

జవాబు: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రతి బస్తీకి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు.